రాష్ట్ర స్థాయి అథ్లెటిక్

ఎంపిక పోటీలు

సిరిసిల్ల టౌన్, జూన్ 1: జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం 10వ తెలంగాణ స్టేట్ సీనియర్, యూత్, టీఎస్ కిడ్స్ రన్స్ ఎంపిక పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా అండర్-8, 10, 12, 14, 16, 18, 20 విభాగాల్లో బాల బాలికలు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన 30మంది క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్, గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజేతలుగా నిలిచిన 30మంది క్రీడాకారులను ఈ నెల 6, 7తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇక్కడ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల రామారావు, వ్యాయామ టీచర్లు అజయ్, కుమార్‌బాబు, శ్రీనివాస్, సాయికృష్ణ, సాయికుమార్ ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో మామిడిపల్లి గ్రామంలో దగ్ధమైన పశుగ్రాసం

రైతును చుట్టుముట్టిన మంటలు

- కాళ్లకు గాయాలు
- వరికొయ్యకాలు కాల్చివేస్తుండగా ప్రమాదం

కోనరావుపేట, జూన్1: పంట పొలంలో వరికొయ్యలను కాల్చుతున్న క్రమంలో రైతుకు మంటలు చుట్టుముట్టాయి. దీంతో ఆ రైతుకు తీవ్ర గాయాలు కాగా, దవాఖానకు తరలించారు. మామిడిపల్లి గ్రామంలో జవ్వాజి మల్లయ్యగౌడ్ తన వ్యవసాయ క్షేత్రంలో వరి కొయ్యలను కాల్చేందుకు ఉదయాన్నే వెళ్లాడు. ఈ క్రమంలో కొయ్యకాలు కాలుతున్న తరుణంలో గాలి వీయగా మంటలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి. దీంతో పక్కనే ఎడ్లబండికి ఉన్న ఎడ్లను కాపాడుతున్న క్రమంలో రైతును మంటలు చుట్టుముట్టాయి. మంటల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో కాళ్లు కాలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన పలువురు సదరు రైతును చికిత్స కోసం వేములవాడలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మంటలు ఆర్పే ప్రయత్నం చేసిన మరో రైతు జవ్వాజి సత్తయ్యగౌడ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మంటలు ఎంతకు అదుపులోకి రాకపోవడంతో గ్రామస్తులు ఫైర్‌సిబ్బందికి ఫోన్ చేయగా, వారు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అర్పివేశారు. అప్పటికే సుమారు పది ట్రాక్టర్ల పశుగ్రాసం, మోటారు పైపులు, వైర్లు, ఎడ్లబండి పూర్తిగా కాలిబూడిదయ్యాయి. సుమారుగా లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

సహకార సంఘాల ఎన్నికలకు

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

కలెక్టరేట్, జూన్ 1: జిల్లాలో ఐదేండ్లు పూర్తి చేసుకున్న అన్ని సహకార సంఘాల కార్యవర్గాలకు త్వరలోనే ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా సహకార అధికారి బుద్ధనాయుడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర సహకార సంఘాల ఎన్నికల ఆథారిటీ హైదరాబాద్ ఆదేశాలు జారీ చేసినందున జిల్లాలోని వివిధ సహకార సంఘాల ఫంక్షనల్ రిజిస్ట్రార్లు త్వరితగతిన ఎన్నికల ప్రతిపాదనలు రాష్ట్ర సహకార సంఘాల ఎన్నికల అథారిటీకి పంపాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ది సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు లి.. సిరిసిల్ల ఎన్నికలు ఈనెల 6న నిర్వహించనున్నట్లు తెలిపారు. సుమారు 6,177 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని చెప్పారు. జూన్‌లో అన్నపూర్ణ మహిళా కంజుమర్ స్టోర్స్, సిరిసిల్ల, 17వ బెటాలియన్ ఉద్యోగుల పరపతి సంఘం, సర్దాపూర్ సిరిసిల్లకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 86మత్స్య సహకార సంఘాలు, జిల్లా మత్స్య సహకార ఫెడరేషన్ లి .. సిరిసిల్ల ఎన్నికలు నిర్వహించామన్నారు. గొర్రెల పెంపకందారులు, గీత కార్మికుల సహకార సంఘాలకు సంబంధిత ఫంక్షన్ రిజిస్ట్రార్లు వారి సంఘాల ఎన్నికల ప్రతిపాదనలు రాష్ట్ర సహకార సంఘాల ఎన్నికల ఆథారిటీకి సమర్పించాలని పేర్కొన్నారు.

ముస్తాబాద్: మద్దికుంట ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఇల్లంతకుంట: వేడుకల్లో పాల్గొన్న పొత్తూరు గ్రామస్తులు

జైబోలో హనుమాన్‌కీ..

- ఘనంగా హనుమాన్ పెద్ద జయంతి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

చందుర్తి: స్వామివారికి అభిషేక పూజలు జరిపిస్తున్న అర్చకుడు

ఇల్లంతకుంట/ముస్తాబాద్/చందుర్తి/ వేములవాడ రూరల్, జూన్ 1: జిల్లా వ్యాప్తంగా శనివారం హనుమాన్ పెద్ద జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. ఈ సందర్భంగా ఆలయాల ప్రాంగణాల్లో జైబోలో హనుమాన్ కీ జై.. అంటూ నినదించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఇల్లంతకుంట మండలం పొత్తూరులో భక్తులు అన్నదానం చేశారు. అలాగే మండల కేంద్రంలోని గంగాధర క్షేత్రంలో కల్యాణోత్సవం, ప్రత్యేక పూజలు చేశారు. ముస్తాబాద్ మండలం మద్దికుంటలో నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు మంగళహారతులతో హాజరయ్యారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. అలాగే చందుర్తి మండలం మల్యాలలోని ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేములవాడ మండలం అగ్రహారం హనుమాన్ ఆలయంతోపాటు లింగంపల్లి, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. లింగంపల్లి గ్రామంలో నిర్వహించిన వేడుకలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

వేములవాడ రూరల్: వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ముస్తాబాద్: భక్తులకు అన్నదానం చేస్తున్న ఎంపీపీ శరత్‌రావు, కుటుంబ సభ్యులు

మాట్లాడుతున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత

సేవాభావం అభినందనీయం

- ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత

వేములవాడ, జూన్ 1: వేములవాడ రాజన్న క్షేత్రంలో ఆర్యవైశ్యులు పెద్దఎత్తున సత్రాలు నిర్మించి, భక్తులకు సేవలు అందించడం అభినందనీయమని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆర్యవైశ్య సత్రంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎమ్మెల్సీ దయానంద్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, జిల్లాలో కల్యాణ మండపాన్ని నిర్మించి ఉచితంగా అందజేస్తామని చెప్పడం అభినందనీయమన్నారు. రాజన్న క్షేత్రం లోనూ ఇంత పెద్ద సత్రం నిర్మించి భక్తులకు అందిస్తున్న సేవల మాదిరిగానే వెనుకబడిన కుటుంబాలకు చేయూత అందించాలని కోరారు. అనంతరం వారిని ఆర్యవైశ్య సత్రం అధ్యక్షుడు బుస్స శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొత్తపెల్లి శ్రీనివాస్, సభ్యులు సత్కరించారు. ఇక్కడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్ చైర్మన్ బింగి మహేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, సంఘం నాయకులు, తదితరులు ఉన్నారు.

వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్ భవనం

ఆవిర్భావ వేడుకలకు సర్వ సన్నద్ధం

రాజన్న సిరిసిల్ల (నమస్తే తెలంగాణ), జూన్ 1/కలెక్టరేట్: సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో ఆదివారం నిర్వహించబోయే రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 9గంటలకు కలెక్టర్ అనురాగ్ జయంతి జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. ఈ సందర్భంగా శనివారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యాలయ సిబ్బంది అందరూ వేడుకలకు హాజరు కావాలని ఆయన సూచించారు. ఆయన వెంట పరిపాలన అధికారి రాంరెడ్డి, పర్యవేక్షకుడు వేణు, తదితరులు ఉన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం

వీర్నపల్లి, జూన్ 1: మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కాగా, మూడు గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. సీతారాంనాయక్‌తండాకు చెందిన ఓ వ్యక్తి గర్జనపల్లిలో భూమిని చదును చేసే క్రమంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ అడ్డుగా రావడంతో ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేశారని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై ఏఈ అనిల్‌ను ఫోన్‌లో సంప్రదించగా, పైప్‌లైన్ ధ్వంసం చేసి సీతారాంనాయక్‌తండాకు చెందిన నునవత్ రాజంపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయంగా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆదివారం పూర్తి స్థాయిలో పైప్‌లైన్ మరమ్మతులు చేపడుతామన్నారు.

3 నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

- అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్
- పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

కలెక్టరేట్, జూన్ 1: ఈ నెల 3నుంచి పదో తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ పేర్కొన్నారు. శనివారం పదో తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా నుంచి మొత్తం 120 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. జిల్లా కేంద్రం లోని వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ నెల 3నుంచి 11దాకా పరీక్షలు కొనసాగుతాయన్నారు. పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కేంద్రాలకు ఎలక్ట్రానిక్ పరికరాల అనుమతి లేదని స్పష్టం చేశారు. కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని ఆదేశించారు. సెస్ అధికారులు విద్యుత్ సరఫరాలో లోపం లేకుండా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు ఉండాలని సూచించారు. సమావేశంలో డీఈవో రమేశ్‌కుమార్, పర్యవేక్షకుడు వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల జీతం ఇస్తేనే విధుల్లోకి..

కార్యదర్శికి సమ్మె లేఖ అందిస్తున్న పారిశుధ్య కార్మికులు

గంభీరావుపేట, జూన్ 1: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు తమకు రావాల్సిన ఆరు నెలల జీతం చెల్లిస్తేనే విధుల్లో చేరుతామని శనివారం పంచాయతీ కార్యదర్శికి సమ్మె పత్రం అందించారు. ఆరు నెలల కొద్ది పెండింగ్‌లో ఉన్న జీతాలు రాకపోవడంతో తమ కుటుంబపోషణ భారమైందని, పారిశుధ్య కార్మికులు నాలుగు రోజులుగా తమ విధులు నిర్వర్తించలేదు. దీంతో ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన పారిశుధ్య కార్మికులకు పంచాయతీ అధికారులు నోటీసులు అందించారు. కార్మికులు తక్షణమే విధుల్లోకి చేరాలన్నారు. ఆరు నెలల పెండింగ్ జీతాలు వచ్చేదాకా చేరేదిలేదని లేఖ ద్వారా అధికారులకు కార్మికులు తెలిపారు.

అడవిలో వానరాలకు ఆహారం

గంభీరావుపేట, జూన్ 1: మండలంలోని పెద్దమ్మ స్టేజీ వద్ద అటవీ ప్రాంతంలో వానరాలకు కోనరావుపేటకు చెందిన ప్రకృతి ప్రేమికుడు ప్రకాశ్ స్వచ్ఛందంగా ఆహారం అందిస్తూ వాటి ఆకలి తీర్చుతున్నారు. మండుతున్న ఎండలు తాగడానికి నీరు, తినడానికి తిండి లేకుండా అడవిలో అలమటిస్తున్న వానరాలకు ప్రకాశ్ వారానికి మూడు సార్లు అరటి పండ్లు, బ్రెడ్, పుట్నాలు అందిస్తూ కొంతమేరకు వాటి ఆకలి తీర్చుతుండగా, పలువురు అభినందించారు.

కోతులకు అరటి పండ్లు అందిస్తున్న ప్రకాశ్

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

రాజన్న సన్నిధిలో ప్రభుత్వ విప్

వేములవాడ టౌన్, జూన్ 1: శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారిని ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, చందుర్తి జడ్పీటీసీ నాగం కుమార్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పాత సత్యలక్ష్మి, కనికరపు రాకేశ్, ధర్మపురి శ్రీనివాస్, సాయి తదితరులు ఉన్నారు.

కేక్ కోసి.. స్వీట్లు పంచి..

సిరిసిల్ల రూరల్, జూన్ 1: బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర నాయకుడు పర్శ హన్మాండ్లు జన్మదిన వేడుకలను శనివారం తంగళ్లపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలాధ్యక్షుడు రామాగౌడ్ ఆధ్వర్యంలో పద్మనగర్‌లోని వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బ్రెడ్‌లు అందజేశారు.

గంభీరావుపేట, జూన్ 1: మండల కేంద్రంలోని మా అనాథ వృద్ధాశ్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నాయకులు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఇక్కడ బీసీ సంఘం నాయకులు బట్టు ప్రవీణ్, నరేశ్‌చారి, ఎలుక రాజు, మహేశ్ ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో: నలుగురికి గాయాలు

సిరిసిల్ల రూరల్, జూన్ 1: జనగామ జిల్లా బచ్చనపేట మండలం సల్వాపూర్‌కు చెందిన చిట్యాల గణేశ్ తన కుటుంబ సభ్యులతో మాల విరమణ కోసం కొండగట్టు కు వెళ్తుండగా, మార్గ మధ్యంలోబద్దెనపల్లి శివారుకు చేరుకోగానే ఎదరుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పూజా, జస్వంత్, ఆటో డ్రైవర్ రాకేశ్, మధుకు గాయాలు కాగా, స్థానికులు 108 ద్వారా సిరిసిల్లలోని జిల్లా ప్రదాన దవాఖానకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పునర్‌ప్రారంభం

- జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మీరాజం

రాజన్నసిరిసిల్ల, జూన్ 1(నమస్తే తెలంగాణ): జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు పునర్‌ప్రారంభమయ్యాయని జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు. శనివారం వేములవాడ మండలం చెక్కపల్లి సెక్టార్‌లో అంగన్‌వాడీ టీచర్లకు ఓరియంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో పాలు, గుడ్లు, బియ్యం, పప్పు, నూనె, పోపు దినుసులు, బాలామృతం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మే 1 నుంచి 31 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒంటి పూట బడి నిర్వహిస్తూ ఆయాకు 15రోజులు, టీచర్‌కు 15రోజుల చొప్పున సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. సమావేశంలో సూపర్‌వైజర్లు నిర్మల, సుస్మిత, సీడీపీవో అలే ఖ్య, మెడికల్ ఆఫీసర్ దీప్తి, డీ హబ్ కో ఆర్డినేటర్ రోజా, జండర్ స్పెషలిస్ట్ దేవిక పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్
- పలు ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

వేములవాడ రూరల్: చెక్కపల్లిలోని ఫర్టిలైజర్‌షాప్‌ను తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాస్

ఇల్లంతకుంట: తనిఖీలు చేస్తున్న ఏవో, పోలీసులు

వేములవాడ రూరల్/ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/వీర్నపల్లి, జూన్ 1: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. వేములవాడ రూరల్ మండలం వట్టెంల, చెక్కపల్లి గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఎస్పీ ఆదేశాల ప్రకారం ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. నకిలీ, లూజ్ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులు డీలర్ల నుంచి బిల్లులను తీసుకోవాలని సూచించారు. స్టాక్ రికార్డుల ప్రకారం ఎరువుల బస్తాలు, విత్తనాలను పరిశీలించారు.

- ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు విత్తన విక్రయ కేంద్రాల్లో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఎస్ఐ రమాకాంత్ తనిఖీలు చేశారు. విత్తనాలను బ్లాక్ చేసి కృత్రిమ కొరతను సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని షాపుల నిర్వాహకులను హెచ్చరించారు.
- ఇల్లంతకుంట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను స్థానిక పోలీసులతో కలిసి ఏవో సురేశ్‌రెడ్డి తనిఖీ చేశారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని రైతులకు సూచించారు. ఇక్కడ ఏఎస్ఐ సంజీవరావు, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.
- వీర్నపల్లిలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను ఎస్ఐ రమేశ్ తనిఖీ చేశారు. విత్తన కంపెనీల పత్రాలు, బిల్లులు, స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనాలని, రసీదులు జాగ్రత్తగా ఉంచుకోవాలని ఆయన సూచించారు.

'లోక్ అదాలత్'ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత

గాంధీ చౌక్, జూన్ 1: సిరిసిల్ల, వేములవాడ కోర్టులలో ఈ నెల 8న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత సూచించారు. జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కక్షిదారులు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకుంటే కేసులు సత్వరమే పరిష్కారమై తమకు న్యాయం అందుతుందన్నారు. జిల్లాలో రాజీ చేసుకోదగిన 560 క్రిమినల్ కేసులను గుర్తించినట్లు తెలిపారు. లోక్‌అదాలత్ ద్వారా రాజీ చేసుకున్న సివిల్ కేసుల్లో చెల్లించిన కోర్టు ఫీజు తిరిగి ఇవ్వనున్నట్లు చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైశ్వాల్, లోక్ అదాలత్ సభ్యుడు భాస్కర్ పాల్గొన్నారు.

ఎంఆర్‌సీకి చేరిన

పాఠ్యపుస్తకాలు

ముస్తాబాద్ జూన్ 1: మండలంలోని 44 ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు శనివారం మండల విద్యావనరుల కేంద్రానికి చేరాయని మండల నోడల్ అధికారి రాజిరెడ్డి తెలిపారు. ఈ నెల 12న పాఠశాలలు పునర్‌ప్రారంభం అవుతున్న దృష్ట్యా ప్రభుత్వం విద్యార్థుల చదువులకు ఇబ్బందులు రాకుండా ముందస్తుగా పాఠశాలలు తెరిచేలోపు అన్ని పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు అందించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మండలంలోని 44 పాఠశాలకు 11వేల పాఠ్యపుస్తకాలు, 11వేల నోట్‌బుక్‌లు మండల విద్యా కార్యాలయానికి వచ్చాయని తెలిపారు. ఇక్కడ మండల విద్యాఅధికారి కార్యాలయ సిబ్బంది ఉన్నారు

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కలెక్టరేట్, జూన్ 1: అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన జూనియర్ అసిస్టెంట్ (పంచాయతీ కార్యాలయం) మందాటి శ్రీశైలంను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ అనురాగ్‌జయంతి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మందాటి శ్రీశైలం తరుచూ విధులకు గైర్హాజరవుతున్నాడు. ఎలాంటి సమాచారం లేకుండా గత మార్చి 30వ తేదీ నుంచి విధులకు హాజరు కావడంలేదు. నిబంధనల ప్రకారం శ్రీశైలంను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

ఒకరి బలవన్మరణం

ముస్తాబాద్, జూన్ 1: నామాపూర్‌కు చెందిన బిట్ల బుచ్చయ్య(50) కుటుంబ సమస్యలతోపాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది గత బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించగా, అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. బుచ్చయ్య సోదరుడు మల్లేశం ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.